సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ◆ 14 ◆ సెప్టెంబర్ ◆ 2024



కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ తనిఖీ

విశాఖ కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా శుక్రవారం తనిఖీ చేశారు. 8లో



కిముడుపల్లిలో జోల్డా సందడి

పెదబయలు మండలంలోని కిముడుపల్లిలో శుక్రవారం కొర్రకొత్త పండగలో భాగంగా జొల్డా పండగ సందడి నెలకొంది. 8లో



జోలాపుట్టు బ్రిడ్జికి మరమ్మతులు

ఇటీవల వరద ఉధృతికి దెబ్బతిన్న జోలాపుట్టు సరిహద్దు వంతెనకు ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

ప్రమాదస్థాయిలో బలిమెల



బలిమెల నుంచి విడుదల అవుతున్న వరదనీరు

సీలేరు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని బలిమెల జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయిలోనే ఉంది. ఈ ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్లు ఎత్తి గుంటవాడ జలాశయానికి మూడు రోజులుగా 20 వేల క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ వరద తాకిడి ఏమాత్రం తగ్గలేదు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి **నీటిమట్టం** 1516అడుగులు కాగా శుక్రవారం నా**టికి 1513** అడుగులు ఉంది. గుంటవాడ నీటిమట్టం **కూడా** భారీగా పెరుగుతోంది. పూర్తిస్థాయి **నీటిమట్టం** 1360 అడుగులు కాగా ప్రస్తుతం **1354 అడు**గుల మేర నీరు ఉంది. ఇక గేటును **ఎత్తి 4వేల** క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తికి, 8వేల **క్యూసె**క్కులు డొంకరాయికి విడుదల చేస్తు**న్నారు.**

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

సాక్షి, పాడేరు: స్థానిక పాలిటెక్నిక్ **కళాశాలలో** ఈనెల 19న నిర్వహిస్తున్న జాబ్‌మేళా**కు సంబం**ధించి ప్రచార పోస్టర్లను శుక్రవారం కలె**క్టర్ దినేష్** కుమార్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు 10 నుంచి ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బిటెక్‌తో పాటు ఇంకా పై చదువులు చదివిన నిరుద్యోగ యువతీ,యువకులు తమ ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.20వేల మేర వేతనం ఆయా కంపెనీలు చెల్లిస్తాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్‌ను 6302636174, 9398338105 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

అరకు స్పోర్ట్స్ పాఠశాలలో సీట్ల భర్తీకి చర్యలు

పాడేరు: అరకు బాలుర (స్పోర్ట్స్) పాఠశాలల్లో 2024–25కు సంబంధించి సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో ఐదో తరగతిలో 30, ఏడవ తరగతిలో 8, ఎనిమిదో తరగతిలో 8, తొమ్మిదిలో మూడు సీట్ల భర్తీకి జోనల్ స్థాయిలో ఈనెల 17న పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు వారి ధ్రువపత్రాలు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, జనన ధ్రువీకరణ పత్రాలతో అరకువేలీ పాఠశాలకు రావాలని తెలిపారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 23న రాష్ట్రస్థాయి పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

17 నుంచి డీవార్మింగ్ మాత్రల పంపిణీ

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఈనెల 17నుంచి 25వతేదీ వరకు జరిగే డీవార్మింగ్ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 64 పీహెచ్‌సీల పరిధిలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 3,35,190 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎస్‌వో కైలాస్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ వై.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

కింగ్ కోబ్రా హల్‌చల్



నివాస సముదాయాల మధ్య కింగ్ కోబ్రా

మోతుగూడెం: స్థానిక ఏపీ జెన్‌కో కాలనీలో శుక్రవారం కింగ్‌కోబ్రా హల్‌చల్ చేసింది. జెన్‌కో ఉద్యోగుల నివాస సముదాయమైన సెకండ్ రింగ్ రోడ్ ప్రాంతంలో సంచరిస్తుండటంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. ఈ నెలలో జెన్‌కో ఆస్పత్రి ఓపీ రూమ్‌లోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేయడం తెలిసిందే. పొల్లూరు–మోతుగూడెం మధ్య, ధారాలమ్మ గుడి వద్ద సంచరిస్తూ స్థానికులకు కనిపించింది. దీనిని పట్టివేతకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మా అమ్మాయి భవిష్యత్తు ఏమిటో?



మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే తెలివైన మధ్యతరగతి, దిగువ తరగతి పిల్లలు వైద్యులు కావడం కష్టమే. ఎంతోమంది పేద పిల్లలు డాక్టర్ కావాలన్న ఆశతో కష్టపడి చదువుకుంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న కొత్త నిర్ణయంతో వారి ఆశలన్నీ అడియాసలు అయినట్లే. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా వైద్య కళాశాలలు ఏర్పాటుకు కంకణం కట్టుకున్నారు. ఆయనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని కూటమి ప్రభుత్వం ఈవిధంగా కుట్ర చేయడం దారుణం. మా పాప ఈ ఏడాది నీట్ పరీక్షలు రాసింది. ప్రభుత్వ రాజకీయ నిర్ణయాలతో ఆమె భవిష్యత్తు ఏమవుతుందోనని బెంగగా ఉంది.

– మైనం శ్రీనాగగోపి, చమ్మచింత, నాతవరం మండలం



అవరోధాలు సృష్టించడం అన్యాయం



వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దారుణం. కొత్తగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటైతే మాలాంటి నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆశపడ్డాం. కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి సీట్లు పెంచాల్సిన ప్రభుత్వం అవరోధాలు సృష్టించడం అన్యాయం. ఈ ఏడాది సీట్లు పెరుగుతాయని ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. వారి కలలను ప్రభుత్వం నీరు గార్చింది. సర్కారు తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల మాలాంటి పేద పిల్లల భవిష్యత్తు గందరగోళంగా మారుతుంది.

–సలాది షర్మిల, బైపీసీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, తెనుగుపూడి, దేవరాపల్లి మండలం

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన జోలాపుట్టులో శాశ్వత వంతెన నిర్మాణం పదేళ్లుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది. 2014లో రూ.5కోట్లతో మొదలైన పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. దీనిపై అప్పటి ఆంధ్రా–ఒడిశా ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో నిధులు మంజూరైనా ఫలితం లేకపోయింది. వరదలు సంభవించినప్పుడల్లా తాత్కాలిక ఐరన్ వంతెనకు నష్టం జరిగి రాకపోకల సమస్య తలెత్తుతోంది.

పదేళ్లుగా.. పునాదుల్లోనే..





పునాది స్థాయిలో నిలిచిపోయిన వంతెన (ఇన్‌సెట్) అలంకారప్రాయంగా శిలాఫలకం

- జోలాపుట్టులో హైలెవెల్ వంతెనకు 2014లోనే శంకుస్థాపన
- నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో నిలిచిపోయిన నిర్మాణం
- సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టని అప్పటి ఆంధ్రా, ఒడిశా ప్రభుత్వాలు
- తాత్కాలిక వంతెన దెబ్బతిన్నప్పుడల్లా ఇబ్బందులు
- వంద గ్రామాల ప్రజలకు అవస్థలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు జోలాపుట్టులో జలాశయం దిగువున హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణంపై ఏళ్ల తరబడి ఇరు ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రాజెక్ట్ నుంచి వరద నీటిని విడుదల చేసినప్పుడల్లా కాలినడక వంతెనకు నష్టం జరుగుతోంది. దీనివల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దులోని సుమారు వంద గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.5 కోట్లతో 2014లో మొదలైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి.

మూడేళ్లపాటు కర్రల వంతెనే దిక్కు

ఈ ప్రాంతంలోని బ్రిడ్జి 2006లో వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి సరిహద్దు గ్రామాల ప్రజలు తీసుకువెళ్లారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు కర్రలతో వంతెన ఏర్పాటుచేసుకున్నారు. మూడేళ్లపాటు మాత్రమే పనిచేసింది.

పనుల జాప్యంతో నిధులు వెనక్కి..

2014లో అప్పటి కేంద్ర గిరిజన వ్యవహారాలు మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి (అరకు ఎంపీ) కిశోర్ చంద్రదేవ్ హైలెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో సరిహద్దు గ్రామాల ప్రజల్లో ఆశలు చిగురించాయి. అప్పటిలో ఆయన తన నిధుల నుంచి రూ.5 కోట్లు మంజూరు చేయడంతో ప్రారంభమైన పనులు పునాదుల వరకు మాత్రమే జరిగాయి. నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ప్రభుత్వాలు మారిపోవడంతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం మరుగున పడింది.

ఐరన్ వంతెనపై కాలినడకన రాకపోకలు

ప్రజల సమస్యను గుర్తించిన జోలాపుట్టు ప్రాజెక్ట్ అధి**కారులు 2016లో కాలినడ**కన వెళ్లేలా తాత్కాలికంగా **ఐరన్ వంతెనను ఏర్పాటు**చేసి రెండు వక్కలా అప్రోచ్ **నిర్మించారు. ద్విచక్ర వా**హనాలు మాత్రమే వెళ్లేలా **ఉండేది. అప్పటినుంచి** ప్రజలు వినియోగించుకుం**టున్న తరుణంలో తాజా**గా వరదనీటికి ఐరన్ వం**తెన అప్రోచ్ రోడ్డు కోత**కు గురైంది. వంతెనపై రక్షణ **పిల్లర్లు దెబ్బతిన్నాయి.**

డ్యామ్‌కు పొంచి ఉన్న ముప్పు : ఐరన్ వంతెనపై నుంచి రాకపోకలు సాగించే అవకాశం లేనందున భారీ వాహనాలు జోలాపుట్టు డ్యామ్ మీదుగా వెళ్తున్నాయి. దీనివల్ల ప్రాజెక్ట్‌కు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఆంధ్రా, ఒడిశా ప్రభుత్వాలు శాశ్వత వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టలేదు.

ముమ్మాటికీ పాలకుల నిర్లక్ష్యం

శాశ్వత వంతెన నిర్మాణం పూర్తయితే రాకపోకల సమస్య పరిష్కారం అవుతుందని ఆశించాం. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నిర్మాణ పనులు మధ్యస్తంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఆంధ్రా, ఒడిశా ప్రభుత్వాలు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి.

– శేఖర్, జోలాపుట్టు, ముంచంగిపుట్టు మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం

జోలాపుట్టు వంతెన నిధులు ఎప్పుడో వెనక్కి వెళ్లిపోయాయి. టెండర్ కూడ రద్దయ్యింది. చాలా సార్లు సరిహద్దు ప్రజలు వంతెన సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరవుతాయని ఆశిస్తున్నాం.

– జబ్బుర్, ఏఈ, గిరిజన సంక్షేమశాఖ, ముంచంగిపుట్టు మండలం

మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పాదన ప్రారంభం



మాచ్‌ఖండ్‌లో వినియోగంలోకి వచ్చిన జనరేటర్లు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన మొదలయింది. ఇటీవల కురిసిన వర్షాలకు జల విద్యుత్ కేంద్రంలో వరదనీరు ప్రవేశించి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం తెలిసిందే. ప్రాజెక్టు అధికారులు, సిబ్బందితో పాటు అగ్నిమాపక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు మొదలు పెట్టారు. ఐదు రోజులు శ్రమించిన అధికారులు శుక్రవారం ఉదయం ఒకటో నెంబర్ జనరేటర్, మధ్యాహ్నం 3వ నెంబర్ జనరేటర్‌ను వినియోగంలోకి తెచ్చారు. రెండు జనరేటర్ల సహాయంతో 34 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నట్లు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. గత రెండు రోజులుగా ఆయన పర్యవేక్షణలో ప్రాజెక్టులో పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వరద తగ్గినా.. వీడని ముంపు



8లో

మోసగించడమే కూటమి నైజం

- కనిపించని సూపర్ సిక్స్ పథకాలు
- పార్టీ మారాలని ప్రలోభ పెట్టే టీడీపీ నేతలకు బుద్ధి చెప్పండి
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యూరు: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేయడమే కూటమి ప్రభుత్వ నైజమని పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన రాజేంద్రపాలెం జెడ్పీ అతిథి గృహంలో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. సీఎం అయిన తరువాత చంద్రబాబు సూపర్‌సిక్స్‌ను అమలు చేయాలంటే భయమేస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పగ్గాలు చేపట్టి వంద రోజులు దాటినా ఇంత వరకు ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు కూటమి నేతలు చేసిన మోసాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కూటమి నేతల ఒత్తిడి వల్ల కొన్నిచోట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పిలవకుండా ప్రొటోకాల్‌ను పక్కన పెడుతున్నారన్నారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు చెప్పారు. కొయ్యూరులో నిర్వహించిన విత్తన పంపిణీలో కనీసం సర్పంచ్‌లు కాని వారు సైతం వచ్చి ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. ఓటమి పాలైన వారు ఇలాంటి రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. పాడేరు నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం పార్టీపై వారికి ఉన్న అభిమానం చూపుతుందన్నారు. డబ్బులను ఎరగా చూపి పార్టీ మారాలని ఒత్తిడి తెచ్చే టీడీపీ నేతలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను పార్టీ నేతలు సత్కరించారు. ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ బంతిని చంద్రబాబు గట్టిగా కొట్టడంతో ఎక్కడికి పోయిందో కనిపించడం లేదన్నారు. వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గాడి నాగమణి, పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మాజీ ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, రాష్ట్ర ఎస్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, గూడెం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇంచార్జీ ఎస్.సూరిబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైద్యరంగాన్ని వ్యాపారం చేయడం దుర్మార్గం

- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ధ్వజం



సాక్షి,పాడేరు: ఏపీలో వైద్య రంగాన్ని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేస్తే, ప్రస్తుత సీఎం చంద్రబాబు వ్యాపారం చేయడం దుర్మార్గమని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉన్నత లక్ష్యంతో తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 17 వైద్య కళాశాలలను తీసుకురావడం చారిత్రాత్మకమన్నారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 56 వేల వైద్య ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంగా 17 వైద్య కళాశాలల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. దీనిని ఓర్వలేని చంద్రబాబు అధికారంలోకి రాగానే వైద్య కళాశాలల్లో వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేసే చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు వైద్య విద్యను దూరం చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

‘చత్రాపల్లి’కి న్యాయం చేసే వరకు పోరాటం

- పార్లమెంట్ దృష్టికి కొండచరియల ఘటన
- అరకు ఎంపీ తనూజరాణి



బాధితులకు నిత్యావసరాలను అందజేస్తున్న అరకు ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు



చత్రాపల్లి గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీ తనూజరాణి, సుభద్ర, భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: కొండచరియలు విరిగిపడటంతో పూర్తిగా నష్టపోయిన చత్రాపల్లి బాధితులకు ప్రభుత్వం పూర్తిగా న్యాయం చేసేవరకు పోరాడుతామని అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి స్పష్టం చేశారు. శుక్రవారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఆమె సప్పర్ల వచ్చిన చత్రాపల్లి బాధితులతో మాట్లాడారు. మీతో ఎన్నుకోబడిన తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించక పోవడం వల్ల బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదన్నారు. మైదాన ప్రాంతాల్లోని వివిధ కర్మాగారాల్లో సంభవించిన ప్రమాదాల్లో మరణిస్తే ఆయా కుటుంబాలకు రూ.కోట్లలో ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం మన్యంలో గిరిజనుల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదన్నారు. గిరిజనుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్క లేదని విమర్శించారు. చత్రాపల్లిలో సంభవించిన కొండ చరియల ఘటనను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. ఏచిన్న అవసరం వచ్చినా వైఎస్సార్‌సీపీ నాయకులను సంప్రదించాలని ఆమె కోరారు. చత్రాపల్లి గిరిజనులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రత్యేకంగా ఆదర్శకాలనీని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తెలిపారు. అనంతరం చత్రాపల్లి గిరిజనులకు బియ్యం, దుస్తులు, వంటపాత్రలు, నిత్యవసరాలు, కొంత నగదును సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి ఎంపీపీలు కోరాబు అనూషాదేవి, బోయినకుమారి, వైస్‌ఎంపీపీలు దేముడు, శారద, పార్టీ నేతలు మోరి రవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పేదల జీవనోపాధికి బ్యాంకులు సహకరించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పేదల జీవనోపాధికి అన్ని బ్యాంకులు సహకరించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంకర్లు, పలుశాఖల అధికారులతో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వర్షాలు, వరదలు వల్ల రైతాంగానికి ఏర్పడిన నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణాలు పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీశాఖ పరిధిలో 30 కిలోమీటర్ల రోడ్డు ధ్వంసమైందని, 37 కల్వర్టులు,వంతెనలు దెబ్బతిన్నాయన్నారు. వాటి మరమ్మతులు,నిర్మాణాలకు రూ.450 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. పంచాయతీరాజ్ రోడ్లు 25 కిలోమీటర్ల మేర శిథిలమవడంతో రూ.153.78 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. 320 గృహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. చింతూరు డివిజన్ పరిధిలో 800 కుటుంబాలను 33 సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించామని.150 వైద్యశిబిరాలు నిర్వహించామని తెలిపారు.14 గ్రామాలపై వరద ప్రభావం చూపిందన్నారు. వరి పైరు 2398 హెక్టార్లు, ఉద్యానవన పంటలు మూడు హెక్టార్లలో నష్టం వాటిల్లిందన్నారు. పశువులు 7, గొర్రెలు, మేకలు 89, కోళ్లు 150 వరకు మృతి చెందాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. మత్స్యకారులకు సంఘాలు ఏర్పాటు చేసి రిజర్వాయర్లల్లో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేస్తే వారికి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పించాలని ఆయన ఆదేశించారు. వర్చువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, కట్టా సింహాచలం, యూబీఐ, ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంకు ఆర్‌ఎంలు పి.నరేష్, ఎం.అభిషేక్, శరత్‌చంద్ర, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, ఎల్‌డీఎం మాతునాయుడు, డీఆర్‌డీఏ పీడీ మాతునాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, నాబార్డు డీడీఎం చక్రధర్ పాల్గొన్నారు.

సీతాఫలం రైతు విలవిల

- పండ్ల ధర భారీగా పతనం
- రెండు వారాల క్రితం బుట్ట రూ.700
- ఇప్పుడు రూ.300కు మించి కొనుగోలు చేయని వ్యాపారులు
- భారీ వర్షాలకు దెబ్బతిన్న మార్కెటింగ్



వంట్లమామిడిలో అమ్మకానికి సిద్ధంగా సీతాఫలాలు



ఘాట్‌లో సీతాఫలాల బుట్టలతో గిరిజన మహిళ

సాక్షి,పాడేరు: మన్యం సీతాఫలం ధరలు ఒక్కసారిగా తగ్గాయి. రెండు వారాల క్రితం పెద్ద బుట్ట రూ.700, చిన్నబుట్ట రూ.500కు విక్రయించేవారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పశ్చిమబంగా వ్యాపారులు కూడా కొనుగోలు చేసి తరలించేవారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నందున వారు రావడం లేదు. దీంతో మార్కెటింగ్ ఒక్కసారిగా పడిపోయింది. కొనేవారు లేక గిరి రైతులు ఆదాయాన్ని తీవ్రంగా నష్టపోతున్నారు.

సీజన్ ప్రారంభంలో మంచి ధర

ఈ ఏడాది జూలై నుంచి సీజన్ ప్రారంభమైంది. మొదట్లో బుట్ట పండ్లను రూ.700కు కొనుగోలు చేయడంతో మంచి ఆదాయం పొందారు. ఇప్పుడు సీజన్ ముగియనున్న తరుణంలో ధర మరింత పెరగాల్సి ఉంది. అలాంటిది పతనం కావడంతో గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏజెన్సీలో పాడేరు, అనంతగిరి, జి.మాడుగుల, హుకుంపేట, చింతపల్లి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో సీతాఫలం తోటలు సాగులో ఉన్నాయి.

వారపు సంతలో దక్కని గిట్టుబాటు ధర

పాడేరులో శుక్రవారం జరిగిన వారపు సంతకు జి.మాడుగుల, పాడేరు మండలాల నుంచి సీతాఫలాలను తీసుకువచ్చారు. వీరి నుంచి స్థానిక వ్యాపారులు పెద్ద బుట్ట పండ్లను రూ.300లోపే కొనుగోలు చేశారు. దీంతో రూ.400కు పైగా ఆదాయం కోల్పోయామని గిరి రైతులు వాపోయారు. 12వమైలురాయి, వంట్లమామిడి, చిత్రాలగొప్పు ప్రాంతాల్లో కూడా గిరి రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.

రెండు వారాల నుంచి నష్టం



రెండు వారాల నుంచి సీతాఫలాలకు ధరలు తగ్గడంతో నష్టపోతున్నాం. గత నెలలో బుట్ట పండ్లను రూ.700కు వంట్లమామిడి జంక్షన్‌లో విక్రయించా. అయితే ఈమధ్య నాలుగు బుట్ల పండ్లను వ్యాపారులకు అమ్మగా ఒక్కదానికి రూ.300 మాత్రమే ఇచ్చారు.

– కిల్లో మీనా, సీతాఫలం రైతు, కాంగెద్ద, పాడేరు మండలం

నిరీక్షించాల్సి వస్తోంది



పాడేరు సంతకు రెండు చిన్న బుట్టలతో సీతాఫలాలను తీసుకువచ్చా. చాలాసేపు వేచి ఉన్న తరువాత బుట్ట పండ్లను రూ.200కు వ్యాపారులు అడిగారు. కొనేవారు లేదక చివరకు అదే ధరతో అమ్మాల్సి వచ్చింది. సంత ఖర్చుకు సరిపడా ఆదాయం రాలేదు.

– వంతాల సింద్రు, సీతాఫలం రైతు, ఓనూరు, పాడేర మండలం

క్లుప్తంగా

50 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు



అరెస్ట్ చేసిన నిందితులతో సీఐ హిమగిరి, ఎస్ఐ సంతోష్,

అరకులోయ రూరల్ : మండల కేంద్రం స్థానిక రాజధాని జంక్షన్‌లో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా నుంచి అరకులోయ మీదుగా గురువారం సాయంత్రం కారులో 50 కిలోల గంజాయి విశాఖపట్నం వైపు తరలిస్తుండగా పటుకున్నట్టు సీఐ హిమగిరి శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. వివరాలివి. కేరళ రాష్ట్రానికి చెందిన నజీబ్, ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బడబదర్ గ్రామానికి చెందిన తుమన్నాథ్ అనే ఇద్దరు వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఆంధ్రా, ఒడిశా పోలీసుల సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జోలాపుట్టు బ్రిడ్జికి మరమ్మతులు

ముంచంగిపుట్టు: జోలాపుట్టు సరిహద్దు వంతెనకు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వరద ఉధృతికి వంతెన కోతకు గురవడంతో రాకపోకలకు సరిహద్దు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక నేతలు కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం నుంచి ఐరన్ వంతెనకు ఇరు వైపులా మట్టిపోసి కాలికనడకన రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు.

కిముడుపల్లిలో జోల్డా సందడి



జోల్డా కొమ్మలతో గ్రామస్తులు

పెదబయలు: మండలంలోని కిముడుపల్లిలో శుక్రవారం కొర్రకొత్త పండగలో భాగంగా జోల్డా పండగ సందడి నెలకొంది. శుక్రవారం గ్రామ సమీపంలో కొండ ప్రాంతం నుంచి సేకరించిన జోల్డా కొమ్మలకు శంకుదేవుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటికి ఇంటివద్ద పూజలు చేసిన తరువాత పొలాల్లోకి తీసుకువెళ్లి నాటారు. వాతావరణం కలిసివచ్చి పంటలు బాగా పండాలని ప్రకృతిని వేడుకున్నారు. అనంతరం ప్రసాదం స్వీకరించారు.

ప్రభుత్వ రంగంలో సీట్లు పెంచాలి



మురళీనగర్: నీట్‌లో 478 మార్కులు వచ్చాయి. దీని వల్ల ఏ-కేటగిరికి బదులు బి-కేటగిరి సీటు వచ్చింది. ఏలూరు ఆశ్రమ్ కాలేజీలో చదువుతున్నాను. రిజర్వేషన్ లేదు. మాలాంటి వారికి ఓపెన్‌లో ఏ-కేటగిరిలో ప్రభుత్వ కాలేజీలో సీటు రావాలంటే కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెరగాలి. ప్రస్తుతం ఏడాదికి ఫీజు రూ.13లక్షలు ఫీజు కట్టాల్సి వస్తోంది. అదే ఏ -కేటగిరి అయితే ఫీజు రూ.20వేలు ఉంటుంది. ప్రభుత్వ కాలేజీలు అయితే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుంది.

– గోపిశెట్టి గీత, మురళీనగర్



ఆశలు నీరుగార్చవద్దు



ఆరిలోవ: మెడిసిన్ చేయాలని ఎన్నో ఆశలతో చదువుతున్నాం. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు వద్దంటుంది. గత ప్రభుత్వం ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. దాని ప్రకారం ఎక్కువమంది విద్యార్థులు మెడిసిన్ చదవడానికి అవకాశం లభిస్తుందనుకొన్నాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలపై కత్తి కట్టింది. దీని వల్ల నీట్ పరీక్ష రాసి మంచి ర్యాంకులు సాధించినప్పటికీ సీట్లు పొందలేని పరిస్థితి వచ్చింది.

– గొలగాని శ్రీరాజ్ఞ, పెదగదిలి, ఆరిలోవ,

వరద తగ్గినా.. వీడని ముంపు

చింతూరు: గోదావరి, శబరినదులు పూర్తిస్థాయిలో తగ్గినా వీటి ప్రభావంతో ఎగపోటుకు గురైన వాగుల వరదనీరు ఇంకా రహదారులపైనే నిలిచి ఉంది.

- వీఆర్‌పురం మండలం శ్రీరామగిరి, వడ్డిగూడెం, రామవరం, అడవి వెంకన్నగూడెం, తుష్టివారిగూడెం, చింతరేగుపల్లి, ఇప్పూరు ప్రాంతాల్లో వరదనీరు ఇంకా రహదారులపై నిలిచి ఉంది. దీంతో మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.
- చింతూరు మండలం చట్టివద్ద చంద్రవంక వాగు వరదనీరు తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి తెలంగాణకు రాకపోకలు కొనసాగుతున్నాయి. కుయిగూరు వాగు వరదనీరు జాతీయ రహదారి-326పై నిలిచి ఉండటంతో ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు ప్రారంభం కాలేదు. దీంతోపాటు మండలంలోని కుయిగూరు, కల్లేరు, మదుగూరు, సూరన్నగొంది గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి.
- సోకిలేరు, చీకటివాగుల వరద ఇంకా రహదారి పైనుంచి తొలగక పోవడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు కొనసాగలేదు. నర్సింగపేట, ముకునూరు, రామన్నపాలెం, బొర్రాయిగూడెం, చినసీతనపల్లి, కొండపల్లి, పెదశీతనపల్లి, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట, మిట్టవాడ, చొలూరు గ్రామాలకు ఇదే పరిస్థితి నెలకొంది.
- నాలుగు రోజుల పాటు వరదనీరు రహదారులపై నిలిచి ఉండటంతో భారీగా బురద పేరుకుపోయింది.

దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో పాడేరు, రంపచోడవరం నుంచి వచ్చిన ఫైరింజన్లతో సిబ్బంది బురదను తొలగిస్తున్నారు.

రహదారులపైనే వాగుల నీరు



చింతూరు మండలంలో కుయిగూరు వాగులో పడవపై రాకపోకలు



జాతీయ రహదారి-326పై భారీగా పేరుకుపోయిన బురద



చింతూరు మండలం నిమ్మలగూడెంలో వరదకు దెబ్బతిన్న వరిపొలాలు



ఫైరింజన్ సాయంతో బురదను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సింహగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పుట్టమన్నుకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా సింహగిరిపై ఉన్న పుట్టబంగారు మండపంలో నిర్వహించాల్సిన ఈ పూజలను వర్షం కారణంగా ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం జరిపారు. అనంతరం ఆలయం నుంచి చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి వేదికపై అధిష్టింపజేశారు. పుట్టమన్నుని స్వామి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం మృత్యం గ్రహణం, యాగశాల ప్రవేశం, యాగశాలార్చన చేపట్టారు. తర్వాత మన్నుని పాలికల్లో వేసి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. అర్చకులు, రుత్వికులకు ఈవో దీక్ష వస్త్రాలను అందజేశారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పవిత్రాదివాసం, చక్రాబ్జమండల రచనం, ఆవాహనం, పవిత్ర ప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి.

17 నుంచి దేవాలయాల్లో స్వచ్ఛ భారత్

మహారాణిపేట: ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అన్ని ఎండోమెంటు దేవాలయాల్లో, ధర్మసత్రాల్లో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్లు (డీసీ),జిల్లా సహాయ కమిషనర్లు (ఏసీ)లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ మాట్లాడారు. శుక్రవారం టర్నర్ సత్రం ఉన్న డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దేవదాయశాఖ ఉప కమిషనర్ సుజాత మాట్లాడుతూ తమ పరిధిలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేశామన్నారు. దేవాలయాలకు వచ్చే భక్తులను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు, సీనియర్ అసిస్టెంట్ మురళీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- లేకుంటే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు అధికారులు ఉదయం, సాయంత్రం పీజీఆర్ఎస్ వెబ్‌సైట్లను సందర్శించి ఫిర్యాదులను పరిశీలించాలని సూచించారు. మీ కోసంలో మొత్తం 89 వినతులు వచ్చినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మావతి, ఎస్డీసీ వీవీఎస్ శర్మ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ ఈఈలు వేణుగోపాల్, రాజు, డీపీవో కొండలరావు, టీడబ్ల్యూ డీడీఐ కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ డి. మురళి, ఐటీడీఏ పరిపాలనాధికారి ఏ.హేమలత, డీఎల్పీవో పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై దృష్టి పెడతాం



కూనవరం: రేషన్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్



కూనవరంలో జేసీకి సమస్య వివరిస్తున్న వరద బాధితులు

జేసీ అభిషేక్ గౌడ్

కూనవరం: వరదలు పూర్తిగా తగ్గి, సహాయక చర్యల ప్రక్రియ పూర్తయ్యాక పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై దృష్టి పెడతామని జేసీ అభిషేక్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పోచవరం, నర్సింగపేట, కూనవరం, పంద్రాజుపల్లి చౌక దుకాణాలను శుక్రవారం ఆయన పాడేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాల్లో అన్ని కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని, పెళ్లి చేసుకుని రేషన్ కార్డులేని వారికి కూడా అందజేయాలని ఆదేశించారు. పోలవరం ప్యాకేజీ ఇప్పించాలని అక్కడే ఉన్న వరద బాధితులు జేసీని కోరారు. ఏడాదిలో రెండు మూడుసార్లు వస్తున్న వరదలకు అన్నివిధాలుగా నష్టపోతున్నామని వాపోయారు. వరదలు తగ్గిన వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై దృష్టి పెడతామని జేసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగబాబు, ఎంపీడీవో లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ తనిఖీ

- క్షతగాత్రులను పరామర్శించిన ఏఎస్సార్ డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- బాధితుల వైద్యసేవలపై సంతృప్తి



కేజీహెచ్‌లో గిరిజనులకు అందుతున్న వైద్యాన్ని పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

మహారాణిపేట (విశాఖ) : కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గాయాల పాలైన కొర్ర రామారావు, కొర్ర పండన్న, కొర్ర సుమిత్ర, కొర్ర సుబ్బారావు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. వీరికి అందుతున్న సేవలపై డీఎంహెచ్‌వో జమాల్ బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం కోసం ట్రైబల్ సెల్‌కు వచ్చే రోగులకు సత్వర వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి పోలవరం బాధితుల సమస్యలు



కూనవరంలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

కూనవరం: వరద బాధితుల ఆవేదన నాకు అర్థమైంది. ఆర్అండ్ఆర్ ప్యాకేజి సమస్యను ప్రభుత్వ దృష్టి తీసుకువెళ్లి మీకు న్యాయం చేస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వరద ముంపుకు గురైన ఉదయ భాస్కర్ కాలని, గిన్నెల బజారు, పాత బస్‌స్టాండ్ సెంటర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి ముగ్గురు చొప్పున బాధితులు వస్తే సీఎం వద్దకు తీసుకువెళ్లి మాట్లాడిస్తానని చెప్పారు. అలాగే బస్‌స్టాండ్ సెంటర్‌లో కొంతమంది యువకులు త్వరితగతిన ప్యాకేజీ ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వీఆర్ పురంలో ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన కిట్లను అక్కడి వరద బాధితులకు ఎమ్మెల్యే శిరీషాదేవి పంపిణీ చేశారు. గాంధీబాబు, మఠం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి ఆకస్మిక తనిఖీలు

రాజవొమ్మంగి: స్పెషల్ ఆఫీసర్ జాన్‌రాజ్, స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావుతో కలసి శుక్రవారం పలు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పీహెచ్‌సీకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల గది, ల్యాబ్ తదితర రికార్డులు పరిశీలించారు. అదే విధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. స్థానిక ఆశ్రమోన్న పాఠశాల స్టోరూం చూసారు. రైతు సేవాకేంద్రాల (ఆర్బీకేలలో) ద్వారా రైతులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లారు. డీటీ ఎ.సత్యనారాయణ, ఎంఈఓ -2 సూరయ్యరెడ్డి ఏఓ రమేష్‌నాయుడు తదితరులున్నారు.

కలెక్టర్ చొరవతో ఘాట్‌రోడ్డులో రాకపోకలు



ఘాట్‌రోడ్డులో మరమ్మతు పనులు



వలసగెడ్డ వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

సీలేరు:గూడెం కొత్తవీధి నుంచి సీలేరు మీదుగా వళ్లే అంతర రాష్ట్ర రహదారిలో ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం నుంచి రాకపోకలు పునప్రారంభమయ్యాయి.అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత ఆదివారం భారీ వర్షాలకు రహదారి అతలాకుతలం అయింది. జి.కె.వీధి మండల కేంద్రం నుంచి సీలేరు వరకు భారీఎత్తున కొండచరియలు విరుగుపడి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో కలెక్టరు దినేష్‌కుమార్, ఐటీడీఏ పిఓ అభిషేక్ ఆదేశాలతో ఆర్‌ఎండ్‌బీ అధికారులు వాటిని తొలగించాలని రాకపోకలకూ ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు.దీంతో 5 రోజుల శ్రమించి పనులను పూర్తి చేశారు.

పూర్తి స్థాయిలో రోడ్లను అభివృద్ధి చేస్తాం

గూడెంకొత్తవీధి నుంచి సీలేరు మీదుగా పాలగెడ్డ వరకు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారని ఆర్‌ఎం డ్ బీ ఈఈ బాల సుందరబాబు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతానికి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని,పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి కలెక్టరుకు నివేదిక ఇస్తామని, రెండు రోజుల్లో బస్సులు తిరిగేందుకు వీలయ్యేలా చేస్తామన్నారు.ఈ సందర్భంగా పాలగెడ్డ వరకు ఉన్న రహదారిని పరిశీలించి వలసగెడ్డ బ్రిడ్జిపై రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టామన్నారు. డీఈ రామారావు, జెఈలు భరత్ , ప్రసాద్ ఉన్నారు.

ట్రాలర్ ఢీకొని వివాహిత దుర్మరణం



కిరణ్మయి మృతదేహం

సీతమ్మధార: ట్రాలర్ ఢీకొని వివాహిత దుర్మరణం చెందారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. గాజువాక ప్రాంతం బీసీరోడ్డు సంజీవ్‌గిరి కాలనీలో మోర్తా కిరణ్మయి (35) భర్త శ్రీనివాసరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాది కిందటే వివాహం జరిగింది. శ్రీనివాసరావు ఓ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె స్కూటీపై నగరానికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి మద్దిలపాలెం నుంచి గురుద్వారా మార్గంలో గాజువాక వెళ్తున్నారు. మార్గమధ్యలో శాంతిపురం జాతీయ రహదారి వద్ద వెనుకనే వస్తున్న పశ్చిమ బెంగాల్‌కి చెందిన ట్రాలర్ స్కూటీని ఢీకొట్టింది. ట్రాలర్ ఎడమ వైపు చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లిపోయాయి. దీంతో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న ద్వారకా పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

బీచ్‌రోడ్డు: ఆర్.కె.బీచ్‌లో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉంది. మూడో పట్టణ సీఐ పల్లా రమణయ్య తెలిపిన వివరాలివీ.. శుక్రవారం సాయంత్రం ఆర్.కె.బీచ్‌కు చేరుకున్న బాలిక తనతో తీసుకొచ్చిన గోళ్ల రంగును తాగింది. కాసేపటికి ఆరోగ్యం విషమించడంతో చుట్టుపక్కల ఉన్న సందర్శకులు గమనించి.. బీచ్‌గార్డ్‌లకు సమాచారం అందించారు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న బీచ్‌గార్డ్‌లు బాలికకు ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం బాగానే ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాక్సైట్ తవ్వకాలకు ప్రభుత్వం కొత్త వ్యూహం



బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అనంతగిరి(అరకులోయ రూరల్): బాక్సైట్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త వ్యూహం రచిస్తుందని మినరల్ అండ్ పీపుల్స్ జాతీయ చైర్మన్ రెబ్బాక ప్రగాడ రవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతగిరి మండలం బొర్రా గుహలో విద్యార్థులు, స్థానిక ప్రజలతో బాక్సైట్‌కు వెలికితీతకు వ్యతిరేకంగా నినదాలు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సైట్, బొగ్గు, వివిద మైనింగ్ తవ్వకాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త వ్యూహలు రచిస్తుందన్నారు, గిరిజన ప్రాంతాల్లో ఉన్న కనీస ఖనిజ సంపదలను వెలికితీస్తే భూగర్భజలాలు ఇంకిపోయి కలుషితమై వాతావరణం మరింత ఎడారిల మారుతుందన్నారు. మన్యం సంపదలను అగ్రదేశాలకు తరలించే కుట్ర మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తుందన్నారు, బాక్సైట్‌పై వ్యతిరేక ఉద్యమం గ్రామ స్థాయి నుంచి ప్రారంభించాలన్నారు. సంఘం ప్రతినిధులు సతీష్‌కుమార్, సైమాన్, సింహాద్రి, దేవకుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.